విజృంభిస్తున్న వైరల్ జ్వరాలు

- ఆసుపత్రికి క్యూ కడుతున్న రోగులు
- నిడదవోలు ప్రభుత్వాసుపత్రిలో రద్దీ
- రోజుకు 350 వరకూ ఓపీ నమోదు



నిడదవోలు ప్రభుత్వాసుపత్రి ఓపీ వద్ద బారులు తీరిన రోగులు



ఆసుపత్రి రక్త పరీక్షల విభాగంలో రోగులు..



ఆసుపత్రిలోని 30 పడకలు నిండి పోవడంతో వరండాలో చికిత్సపొందుతున్న రోగులు

నిడదవోలు: వర్షాకాలంలో చోటు చేసుకుంటున్న వాతావరణ మార్పులతో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. వైరల్ జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఈ తరుణంలో ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రాణాంతక పరిస్థితులు తప్పవని వైద్యులు హెచ్చరిస్తున్నారు. నిడదవోలు పట్టణంలోని 30 పడకల ప్రభుత్వాసుపత్రి (సామాజిక ఆరోగ్య కేంద్రం)లో జ్వర పీడితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఎంతోమంది వైరల్ జ్వరాలతో బాధపడుతూ ప్రభుత్వాసుపత్రికి క్యూ కడుతున్నారు. పట్టణంతో పాటు నిడదవోలు, చాగల్లు మండలాల నుంచి జ్వరాల బారిన పడుతున్న వారు అధిక సంఖ్యలో నిడదవోలు ప్రభుత్వాసుపత్రికి వచ్చి చికిత్స పొందుతున్నారు. దీంతో సాధారణంగా రోజుకు సుమారు 200 గా ఉండే ఈ ఆసుపత్రి ఓపీ ఇప్పుడు సగటున 350 కి పైగా నమోదవుతోంది. రోగుల్లో అత్యధికులు జ్వరాలతో బాధ పడుతున్న వారే. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పలు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉంటోంది. నిల్వ నీటిలో దోమల ఉత్పత్తి అయ్యి, వాటి ప్రభావంతో ఆయా ప్రాంతాల ప్రజలు వివిధ రకాల జ్వరాల బారిన పడుతున్నారు. వ్యాధులు సోకిన తర్వాత ఆసుపత్రుల చుట్టూ తిరిగే కంటే ముందుగానే జాగ్రత్తలు పాటిస్తే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే చాలావరకూ వ్యాధులను నియంత్రించవచ్చని వారు చెబుతున్నారు. ముఖ్యంగా ప్రజలు వైరల్ జ్వరాల బారిన పడడానికి దోమలే ప్రధాన కారణం. వాటి వల్ల డెంగీ, మెదడు వాపు, టైఫాయిడ్, మలేరియా వంటి వ్యాధులు ప్రబలుతాయి.

రోజుకు 100కు పైగా రక్త పరీక్షలు

పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి రోజూ ఎంతోమంది జ్వర పీడితులు స్థానిక ప్రభుత్వాసుపత్రికి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారు. రోజూ వంద మందికి పైగా ఓపీ పేషెంట్లకు ఇక్కడి ల్యాబ్‌లో సిబ్బంది రక్త పరీక్షల ద్వారా రోగ నిర్ధారణ చేస్తున్నారు. ఈ రక్త పరీక్షల్లో డెంగీ, మలేరియా, మలేరియా టైఫాయిడ్ వంటి జ్వరాలు బయట పడుతున్నాయి. సీజనల్ వ్యాధులకు అవసరమైన అన్నిరకాల మందులు ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నాయని వైద్యులు తెలిపారు.

30 పడకలు సరిపోవడం లేదు

నిడదవోలు ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రస్తుతం 30 బెడ్స్ రోగులకు అందుబాటులో ఉన్నాయి. సాధారణ రోజుల్లో ఇన్ పేషెంట్లు తక్కువగానే ఉంటారు. అయితే వర్షాకాలంలో వస్తున్న వాతావరణ మార్పుల వల్ల సీజనల్ వ్యాధులు, వైరల్ జ్వరాలతో బాధపడుతున్న వారు ఎక్కువై, ఈ ఆసుపత్రిలో ఇన్ పేషెంట్లు రోజురోజుకూ పెరుగుతున్నారు. పెరుగుతున్న రోగులకు అందుబాటులో ఉన్న బెడ్స్ సరిపోవడం లేదు. దాంతో అత్యవసర రోగులకు వరండాల్లో అదనపు బెడ్లు ఏర్పాటు చేసి చికిత్స అందిస్తున్నారు.ప్రస్తుతం 45 నుంచి 60 మంది ఇన్ పేషెంట్లు చికిత్స పొందుతున్నారు. వారిలో అత్యధికులు జ్వరాల బారిన పడిన వారే. ఈ ఏడాది జూన్ ప్రారంభం నుంచి ఇప్పటి వరకూ సీహెచ్‌సీలో 1370 వైరల్ జ్వరాల కేసులు నమోదయ్యాయి. దీనిలో జూన్‌లో 45 మంది ఇన్ పేషెంట్లు జ్వరాలతో బాధపడుతూ చికిత్స పొందారు. వారిలో ఆరు టైఫాయిడ్ కేసులు, రెండు డెంగీ కేసులు ఉన్నాయి. అలాగే జులై నుంచి ఆగస్టు 14 తేదీ వరకు 37 మంది ఇన్ పేషెంట్లు చికిత్స పొందుతున్నారు. వారిలో 12 టైఫాయిడ్ కేసులు, 4 డెంగీ కేసులు ఉన్నారు.

తక్షణ వైద్య సేవలు అందిస్తున్నాం



వైరల్ జ్వరాలతో ఆసుపత్రికి వస్తున్న వారికి తక్షణ వైద్య సేవలు అందిస్తున్నాం. ప్రతి ఒక్కరూ వైద్య సేవలు వినియోగించుకోవాలి. వైరల్ జ్వరాలు, ఇతర సీజనల్ వ్యాధుల నివారణకు అవసరమైన మందులు ప్రభుత్వ ఆసుపత్రిలో సిద్ధంగా ఉన్నాయి. వైరల్ జ్వరాలతో వచ్చిన వారికి అవసరమైన రక్త పరీక్షలు చేయిస్తున్నాం. పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందించేందుకు 8 మంది వైద్యులు సిద్ధంగా ఉన్నారు. అవసరమైన వైద్య సిబ్బంది కూడా అందుబాటులో ఉన్నారు.

–ఎఫ్ఏ ఫయాజ్ అన్సారి, సూపరింటెండెంట్, నిడదవోలు ప్రభుత్వాసుపత్రి

క్లుప్తంగా

ఐఎంఏ నిడదవోలు శాఖ అధ్యక్షుడిగా డాక్టర్ నెక్కంటి



డాక్టర్ శ్రీనివాసరావు

నిడదవోలు: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) నిడదవోలు పట్టణ శాఖ నూతన అధ్యక్షుడిగా ప్రముఖ పిల్లల వైద్యుడు నెక్కంటి శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పట్టణంలోని రామలక్ష్మి ఆసుపత్రిలో సోమవారం నిర్వహించిన వైద్యుల సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఐఎంఏ కార్యదర్శిగా డాక్టర్ పరిమి వినోద్ ఎన్నికయ్యారు. డాక్టర్ నెక్కంటి శ్రీనివాసరావు పట్టణంలో 35 ఏళ్లుగా పిల్లల వైద్యుడిగా గుర్తింపు పొందారు. పేద పిల్లలకు తక్కువ ఖర్చుతో ఆధునిక వైద్యం అందిస్తున్నారు. ఈ సందర్భంగా పలువురు పట్టణ ప్రముఖులు నెక్కంటిని అభినందించారు.

ఉపాధి పనుల గుర్తింపునకు 23న గ్రామసభలు

నిడదవోలు రూరల్: ఉపాధిహామీ పథకం అమలులో భాగంగా గ్రామాల్లో కొత్త పనులు గుర్తించేందుకు ఈనెల 23న ప్రతి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామసభ నిర్వహించాలని ఎంపీడీఓ పి.శామ్యూల్ ఆదేశించారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టే ఉపాధి పనుల గుర్తింపుపై సమిశ్రగూడెంలోని మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధి పనులు చేపట్టేందుకు కావాల్సిన పనులను గుర్తించడంతో పాటు గ్రామసభలో ఆమోదించాలన్నారు. ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, ప్రజలను భాగస్వామ్యం చేసి గ్రామాభివృద్ధికి చేపట్టాల్సిన పనులపై నివేదిక సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఎస్.రత్నమాలిక, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

గోష్పాద క్షేత్రంలో చండీ హోమం



కొవ్వూరు జ్ఞాన సరస్వతీ ఆలయంలో చండీహోమం నిర్వహిస్తున్న పండితులు

కొవ్వూరు: స్థానిక గోష్పాద క్షేత్రంలోని జ్ఞాన సరస్వతీ మందిరంలో సోమవారం ఉదయం చండీ హోమం నిర్వహించారు. శ్రావణ పౌర్ణమి సందర్భంగా ఇక్కడి ఆత్మీయ హితకారిణీ సమాజం ఆధ్వర్యంలో ఈ హోమం జరిగింది. పట్టణానికి చెందిన యేడిద వెంకట సూర్య కామేశ్వరరావు, పద్మావతీదేవి దంపతుల చేతుల మీదుగా వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య శాస్త్రయుక్తంగా హోమం జరిపించారు. ముందుగా గణపతి పూజ, నవగ్రహ పూజ, కలశస్థాపన, అష్టోత్తర పూజ చేశారు.గంప వెంకట కృష్ణారావు, తిప్పాభొట్ల సుబ్రహ్మణ్యశాస్త్రి, ఆకెళ్ల సురేష్‌కుమార్, సుబ్రహ్మణ్యం శర్మ తదితరులు పాల్గొన్నారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

'అపుస్మా' నూతన కార్యవర్గం ఎన్నిక



అధ్యక్ష కార్యదర్శులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

గోపాలపురం: ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (అపుస్మా) గోపాలపురం నియోజకవర్గ శాఖ నూతన కార్యవర్గ ఎన్నిక సోమవారం స్థానిక శర్వాణి హైస్కూల్లో నిర్వహించారు. అపుస్మా జిల్లా అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ ఎన్నికలో అధ్యక్షుడిగా శర్వాణి హైస్కూల్ ప్రిన్సిపాల్ రాపాక ఫణి కిషోర్, కార్యదర్శిగా జీఎస్ఆర్ రెడ్డి, కోశాధికారిగా కె. శ్రీనివాసు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో అపుస్మా రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పి.శివాజీ, రవిబాబు, ఈసీ సభ్యులు రవి చంద్ర, మెహర్ శ్రీకృష్ణ, బాపూజీ, వెంకటేశ్వర రావు పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి బీమా సాయం అందజేత

పెరవలి: మండలంలోని అన్నవరప్పాడుకు చెందిన జనసేన పార్టీ కార్యకర్త సాపిరెడ్డి గౌతం ఇటీవల ప్రమాదవశాత్తూ మృతి చెందాడు. సోమవారం ఆ గ్రామానికి విచ్చేసిన రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ మృతుని కుటుంబానికి మంజూరైన రూ.5 లక్షల బీమా పరిహారం చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ రాజకీయ పార్టీల కోసం పని చేసే కార్యకర్తల బాగోగులు చూసే పార్టీ జనసేన మాత్రమే అన్నారు. అన్నవరప్పాడులోని వేంకటేశ్వరస్వామి ఆలయ మరమ్మతులకు ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు తీసుకువస్తానని చెప్పారు. కార్యక్రమంలో జనసేన మండల శాఖ అధ్యక్షుడు పిప్పర రవి, టీడీపీ విభాగం అధ్యక్షుడు అతికాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కోల్‌కతా ఘటనను నిరసిస్తూ శాంతి ర్యాలీ



దేవరపల్లి మండలం దుద్దుకూరులో శాంతి ర్యాలీ చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థినులు



చాగల్లులో శాంతి ర్యాలీ చేస్తున్న పీఎంపీలు



గోపాలపురంలో కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న యుటీఎఫ్ నాయకులు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నేతలు

దేవరపల్లి: కోల్‌కతాలో మహిళా జూనియర్ డాక్టర్‌పై అత్యాచారానికి, హత్యకు పాల్పడిన దోషులను వెంటనే శిక్షించాలని కోరుతూ సోమవారం మండలంలోని దుద్దుకూరు, యర్నగూడెం గ్రామాల్లో యూటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ఉపాధ్యాయులు శాంతి ర్యాలీ నిర్వహించారు. పాఠశాల మధ్యాహ్నం భోజన విరామం సమయంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు శాంతి ర్యాలీ నిర్వహించి రెండు గ్రామాల జెడ్పీ హైస్కూళ్ల వద్ద నిరసన తెలిపారు. మహిళలపై అత్యాచారాలు అరికట్టాలని, వారికి రక్షణ కల్పించాలని, బాధితురాలి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. యూటీఎఫ్ మండల గౌరవాధ్యక్షుడు ఓరుగంటి శివనాగప్రసాద్ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి ఇలాంటి అఘాయిత్యాలకు పాల్పడుతున్నారన్నారు. మత్తు పదార్థాలను నిషేధించాలని, డ్రగ్స్ విక్రయించే వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు లింగంకుంట రామారావు, ప్రధాన కార్యదర్శి బిర్లకల నాగేంద్రప్రసాద్, మండల మహిళా అధ్యక్షురాలు రమాజానకి, ఎంఎస్ మహాలక్ష్మి, మండల ప్రతినిధి ఎ.నర్సమ్మ, కేపీ బిందు, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

చాగల్లులో పీఎంపీల ఆధ్వర్యంలో..

చాగల్లు: కోల్‌కతాలో మహిళా జూనియర్ డాక్టర్‌పై అత్యాచారానికి పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలని చాగల్లు పీహెచ్‌సీ డాక్టర్ తనూజ అన్నారు. ఈ ఘటనకు నిరసనగా పీఎంపీ మండల వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం చాగల్లులో శాంతియుత నిరసన ర్యాలీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ మనోజ్, పీఎంపీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చక్రవర్తి, మండల శాఖ అధ్యక్షుడు సీహెచ్ మల్లేశ్వరరావు, కార్యదర్శి ఆనంద్‌కుమార్, ఉపాధ్యక్షుడు సూర్యప్రకాష్, సంయుక్త కార్యదర్శి షరీఫ్, కోశాధికారి బ్రహ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

గోపాలపురంలో కొవ్వొత్తుల ర్యాలీ

గోపాలపురం: కోల్‌కతాలో హత్యకు గురైన వైద్య విద్యార్థిని ఆత్మకు శాంతి కలగాలని, దోషులను వెంటనే పట్టుకుని శిక్షించాలంటూ కోరుతూ యూటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో గోపాలపురంలో సోమవారం రాత్రి కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు జి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో గోపాలపురం చెక్‌పోస్టు సెంటర్ నుంచి పోలీస్ స్టేషన్ వరకూ శాంతి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు, ప్రజా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

'మానవత' ఆధ్వర్యంలో ర్యాలీ



చివటంలో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, మానవత సంస్థ సభ్యులు

ఉండ్రాజవరం: ప్రపంచ శాంతి, మానవతా విలువలు, పర్యావరణ పరిరక్షణను కాంక్షిస్తూ మానవత సేవాసంస్థ ఉండ్రాజవరం మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం చివటం గ్రామంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఉన్నత పాఠశాల విద్యార్థులు, మానవత సంస్థ సభ్యులు జెండాలు పట్టుకుని, నినాదాలు చేస్తూ గ్రామవీధుల్లో శాంతి ర్యాలీ చేశారు. కార్యక్రమంలో మానవత సంస్థ మండల శాఖ అధ్యక్షుడు కఠారి సిద్ధార్థరాజు, నందిగం వెంకటకృష్ణ పాపారావు, వేలిచేటి బోస్, కోడూరి ప్రసాద్, వీరమల్ల కోటి, కార్యవర్గం సభ్యులు పాల్గొన్నారు.

మాలల ఆధ్వర్యంలో రేపు భారత్ బంద్

కొవ్వూరు: మాలలు, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 21న నిర్వహించే భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని మాల మహాసభ జాతీయ వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు బొంతా శ్యాం రవిప్రకాష్ సోమవారం విజ్ఞప్తి చేశారు. ఎస్సీ రిజర్వేషన్లపై ఆగస్టు 1న సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగ వ్యతిరేకమైనదని ఆయన ఆరోపించారు. ఎస్సీ,ఎస్టీలకు క్రీమీలేయర్ వర్తిస్తుందని పేర్కొనడం దుర్మార్గం అన్నారు. అస్పృశ్యత ఆధారంగా ఎస్సీలకు రిజర్వేషన్ కల్పించారని, ప్రస్తుతం వాటిని ఎత్తివేసే కుట్ర జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీం కోర్టు తీర్పుపై మాల మహాసభ జాతీయ అధ్యక్షుడు మల్లెల వెంకట్రావు ఇప్పటికే సుప్రీం కోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేశారన్నారు.

ఫైళ్లు దగ్ధం చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

నల్లజర్ల: ప్రభుత్వాఫీసుల్లో ఫైళ్లు దగ్ధం చేస్తున్న నిందితులను గుర్తించి, కఠినంగా శిక్షించాలని రిటైర్డ్ ఉద్యోగుల సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి బండి సూర్యనారాయణ కోన్నారు. సోమవారం ఇక్కడ నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ రిటైర్డ్ ఉద్యోగుల సంఘ నల్లజర్ల శాఖ ద్వితీయ వార్షికోత్సవ సభలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వోద్యోగులకు, పెన్షనర్లకు బకాయిపడిన మొత్తాలను దశల వారీగా చెల్లించాలని కోరారు. సమావేశానికి అధ్యక్షత వహించిన మండల శాఖ అధ్యక్షుడు ఐవీ సత్యం మాట్లాడుతూ పెన్షనర్లకు నగదు రహిత వైద్యాన్ని అందించాలన్నారు. సమావేశంలో మండల శాఖ ప్రధాన కార్యదర్శి ఉన్నమట్ల వెంకటేశ్వరరావు, అధ్యక్షుడు ఎస్ఎం ఆలీ సాహెబ్, దేవరపల్లి శాఖ అధ్యక్షుడు పప్పు రామారావు తదితరులు పాల్గొన్నారు.

గోదావరి మాతకు మహా నీరాజనం

కొవ్వూరు: గోదావరి మాతకు స్థానిక గోష్పాద క్షేత్రంలో సోమవారం సాయంత్రం విశేష పూజలు నిర్వహించారు. గోదావరి మహా నీరాజన సమితి అధ్యక్షుడు కలిగొట్ల కృష్ణారావు ఆధ్వర్యంలో శ్రావణ పౌర్ణమి సందర్భంగా అఖండ గోదావరి నదికి మహా నీరాజనం సమర్పించారు. గోదావరి నదికి వివిధ రకాల హారతులు సమర్పించి గీతాలు ఆలపించారు.

కాలువలు పరిశీలించిన ఎమ్మెల్యే మద్దిపాటి

దేవరపల్లి: మండలంలోని రామన్నపాలెంలోని తాడిపూడి, పోలవరం కుడి ప్రధాన కాలువలను గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు సోమవారం పరిశీలించారు. తాడిపూడి కాలువ గట్లు బలహీనంగా ఉండడం వల్ల వర్షా కాలంలో గండ్లు పడి పంటలు ముంపునకు గురవుతున్నాయి రైతులు ఎమ్మెల్యే వెంకట్రాజుకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకట్రాజు మాట్లాడుతూ కాలువ అభివృద్ధికి అంచనాలు తయారు చేయించి ప్రభుత్వానికి నివేదించి, సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని రైతులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, రైతులు, అధికారులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ ఒక రోజు టోకెన్ల ఖర్చు విరాళం

నిడదవోలు: స్థానిక గణేష్ చౌక్ సెంటర్లో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్ ఒక రోజు టోకెన్ల ఖర్చును జనసేన పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు రంగా రమేష్ సోమవారం అందించారు. ఇక్కడ రోజూ సుమారు 300 మందికి ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనాలకు అయ్యే రూ.5 టోకెన్ల ఖర్చును రంగా రమేష్ నిర్వాహకులకు అందించారు. ఆ టోకెన్లను ఆయన వాటిని అక్కడ వచ్చిన పేదలకు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ కౌన్సిలర్ కారింకి నాగేశ్వరరావు, ప్రముఖ వైద్యులు, జనసేన నాయకులు డాక్టర్ కల్యాణ చక్రవర్తి, సీపీఎం నాయకుడు రాంబాబు పాల్గొన్నారు.

తహసీల్దార్ జోక్యంతో డ్రైన్ నిర్మాణం నిలిపివేత

సాక్షి ఇంపాక్ట్

పెరవలి: మండలంలోని కొత్తపల్లి అగ్రహారం గ్రామంలో తాగునీటి పైప్‌లైన్ పై నుంచి డ్రైన్ నిర్మాణం చేపట్టడంపై తహసీల్దార్ అచ్యుతకుమారి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె జోక్యం చేసుకోవడంతో పనులు నిలిచిపోయాయి. వివరాలిలా ఉన్నాయి. ఈ నిర్మాణంపై సోమవారం నాటి 'సాక్షి'లో వార్త ప్రచురితం అయిన విషయం తెలిసిందే. అదీగాకుండా స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఇదే విషయమై కొత్తపల్లి అగ్రహారం గ్రామానికి చెందిన సీపీఎం నాయకుడు జగన్నాథం లిఖిత పూర్వకంగా తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో తహసీల్దార్ అచ్యుతకుమారి అక్కడే ఉన్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తాగునీటి పైప్‌లైన్‌పై నుంచి డ్రైన్ నిర్మాణానికి ఎలా అనుమతి ఇచ్చారని నిలదీశారు. భవిష్యత్తులో పైప్ లైన్‌కు మరమ్మతులు అవసరం అయితే ఏం చేస్తారని ప్రశ్నించారు. పంచాయతీ పాలకవర్గ తీర్మానం చేసిన మీదటే ఆ విధంగా నిర్మాణం చేపట్టామని ఏఈ సమాధానం చెప్పారు. పనులు ఇలాగే కొనసాగిస్తే కలెక్టర్‌కు నివేదిస్తానని తహసీల్దార్ హెచ్చరించారు. దీనితో వెనక్కు తగ్గిన ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంటనే డ్రైన్ నిర్మాణ పనులను నిలిపివేయించారు.

వైభవంగా రక్షాబంధన్ వేడుకలు



దేవరపల్లిలో మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావుకు రాఖీ కడుతున్న కదలి హైమావతి

దేవరపల్లి: అన్నా చెల్లెళ్ల.. అక్కా తమ్ముళ్ల అనుబంధానికి ప్రతీక అయిన రక్షాబంధన్ వేడుకలను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. అన్నదమ్ములకు సోదరీ మణులు రాఖీలు కట్టి, వారి ఆశీర్వాదం తీసుకున్నారు. గోపాలపురం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి వెంకట్రావుకు ఆ పార్టీ దేవరపల్లి మండల మహిళా విభాగం అధ్యక్షురాలు కదలి హైమావతి, పలువురు మహిళలు రాఖీలు కట్టారు. మహిళలకు తలారి వెంకట్రావు రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. శ్రావణ పూర్ణమి పర్వదినం సందర్భంగా ఆలయాల్లో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక ఆదిశంకరాచార్య ధ్యాన మందిరంలో మహాలక్ష్మి హోమం నిర్వహించారు. మహాలక్ష్మి అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు.

సర్పంచుల విషయంలో ప్రొటోకాల్ ఉల్లంఘన



తాళ్లపూడిలో గాంధీజీ చిత్ర పటానికి పూలమాల వేస్తున్న ఎంపీపీ పోశిరాజు, సర్పంచులు



నల్లజర్ల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ సింహాద్రి



పెరవలిలో శిక్షణ కార్యక్రమానికి హాజరైన సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు

- గత ప్రభుత్వం వివక్ష చూపలేదు
- తాళ్లపూడి ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు
- సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ

తాళ్లపూడి: వైఎస్సార్ సీపీ పాలనలో విపక్ష సర్పంచులపై ఎలాంటి వివక్షా చూపలేదని, అయితే ప్రస్తుత ప్రభుత్వం మాత్రం ప్రొటోకాల్ పాటించడం లేదని ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు అన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో కూటమి నాయకులు కొన్ని సందర్భాల్లో సర్పంచుల విషయంలో ప్రొటోకాల్ దాటి వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పాలనాపరమైన అంశాలపై అవగాహన కల్పించేందుకు మండలంలోని సర్పంచులకు, కార్యదర్శులకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మూడు రోజుల శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఎంపీపీ పోశిరాజు, మహిళా సర్పంచులు జ్యోతి ప్రజ్వలన చేసి, గాంధీజీ చిత్ర పటానికి పూలమాల వేశారు. శిక్షణ పొందిన పంచాయతీ కార్యదర్శులు ఆశాఆలేఖ్య, సువర్చల పలు అంశాలను సర్పంచులకు వివరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ పోశిరాజు మాట్లాడుతూ సర్పంచుల పాలన సమయం దాదాపు పూర్తయిందన్నారు. ఉన్న కొద్దిపాటి సమయంలో గ్రామాల అభివృద్ధికి వంతు కృషి చేయాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో టి. వెంకటరమణ, కార్యాలయ సూపరింటెండెంట్ ఎం. రామారావు, సీనియర్ అసిస్టెంట్ అమ్మిరాజు, డీపీఎం ప్రసంగి రాజు, సర్పంచులు కొమ్మిరెడ్డి పరశు రామారావు, నామా శ్రీనివాస్, నక్కా అనురాధ, యాళ్ల స్వప్న, ఎలిపే సుధారాణి, రాపాక రాజేశ్వరి, కాకర్ల హేమావతి, తిగిరిపల్లి వెంకట్రావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గ్రామాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలి

నల్లజర్ల: సర్పంచులు, కార్యదర్శులు సమన్వయంతో పని చేసి గ్రామాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని ఎంపీడీఓ సింహాద్రి అన్నారు. మండలంలోని సర్పంచులు, కార్యదర్శులకు మూడు రోజుల పాటు నిర్వహించే శిక్షణ తరగతులను సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన ప్రారంభించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ సర్పంచులు, కార్యదర్శులు తమ విధి,విధానాలను పూర్తిగా తెలుసుకుని వ్యవహరించాలన్నారు. గ్రామాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించుకొని, ప్రాధాన్య క్రమంలో వాటిని అమలు చేయాలన్నారు. తొలి రోజు శిక్షణలో పంచాయతీ పాలనలో నిర్వర్తించాల్సిన విధులు, విధి నిర్వహణలో ప్రజాప్రతినిధులు, అధికారులు ఎలా పనిచేయాలి? కామన్ అడ్మినిస్ట్రేషన్ ప్రొసీజర్‌లో భాగమైన సమావేశాలు, గ్రామసభ, పర్యవేక్షణ, తనిఖీలు, ప్రజారోగ్యం కోసం పారిశుధ్య నిర్వహణ, చెత్త సేకరణ వంటి అంశాలను వివరించారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం ఏఈ అజయ్‌బాబు పనుల అంచనాల రూప కల్పనపై వివరించారు. రిసోర్సుపర్సన్‌లుగా రత్నం, లక్ష్మీనారాయణ వ్యవహరించారు.

సర్పంచులు, కార్యదర్శుల పాత్ర కీలకం

ఉండ్రాజవరం: గ్రామాల అభివృద్ధిలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శుల పాత్ర కీలకమని ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి అన్నారు. పారిశుధ్యం, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, వీధిలైట్ల నిర్వహణ తదితర అంశాలపై మండలంలోని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు మూడు రోజుల పాటు నిర్వహించే శిక్షణ తరగతులు సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రారంభమయ్యాయి. ఎంపీపీ యల్లారేశ్వరి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం గ్రామ సభల నిర్వహణ, బిల్లులు ప్రతిపాదించడం, అభివృద్ధి ప్రణాళికలు రూపకల్పన తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ప్రసాద్, ఏవో శ్రీనివాసు, సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

చాగల్లులో..

చాగల్లు: పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై మూడు రోజుల పాటు సర్పంచులకు, కార్యదర్శులకు ఇచ్చే శిక్షణ తరగతులను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ మట్టా వీరాస్వామి ప్రారంభించారు. పంచాయతీలను అభివృద్ధి చేయడం, తడిచెత్త –పొడిచెత్త సేకరణ, మంచి నీటి ట్యాంకులను శుభ్రం చేయించడం, రోడ్లు, డ్రైనేజీలను శుభ్రంగా ఉంచడం, మొక్కల పెంపకం వంటి అంశాలను రీసోర్స్ పర్సన్లు వారికి వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో పి.నిర్మలకుమారి, విస్తరణాధికారి ఆర్.శ్రవణ్‌కుమార్, సర్పంచులు మట్టా వెంకట్రావు, కొయ్యే మణి, కుదప రాంబాబు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పెరవలిలో..

పెరవలి: గ్రామాలు అభివృద్ధి చెందాలంటే సర్పంచులు, కార్యదర్శులు ప్రణాళికా బద్ధంగా పని చేయాలని ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ సూచించారు.మండలంలోని సర్పంచులు, కార్యదర్శులకు మూడు రోజు శిక్షణ కార్యక్రమం సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మొదలైంది. శిక్షణలో ఈఓపీఆర్‌డీ సీహెచ్ వెంకటరమణ మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యాన్ని, వీధిలైట్లను మెరుగుపరచాలన్నారు. నిత్యం వెలగాలన్నారు. గ్రామాల్లో సేకరించిన చెత్తను సంపద తయారీ కేంద్రాల వద్ద తడిపొడిగా వేరు చేసి వర్మీ కంపోస్టు తయారు చేయించాలన్నారు. కార్యక్రమంలో అన్ని పంచాయతీల సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

